# బానిస బ్రతుకు

## ఇందూ రమణ

మే మాసపు ఎండలు మండిపోతున్నాయి.

మిట్ట మధ్యాహ్నం !

దాహంతో నోరు పిడచకట్టుకు పోతోంది. అలసటగా వెళ్ళి ఉద్యాన మంటపంలో కూర్చున్నాను. రాతితో చెక్కిన మంటపమేమో! చల్లగా....హాయిగా ఉందా ప్రదేశమంతా !

రెండు కాళ్ళూ బార్లాచాపి రాతిస్థంభానికి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాను.

నా కళ్ళనిండా కల్లోలం !

నా మెదడంతా ఆలోచన్ల మయం ! !

నా మనసంతా సమస్యల వలయం ! ! !

ఏం చేయాలి? ఏం చేస్తే తన సమస్య....బాధ్యత....ఈ ఆపద గట్టెక్కుతాయి?

గుండెల్లో అగ్నిగుండం బ్రద్దలవడానికి సిద్ధంగా ఉంది. బైట ఎండలా గుండె మండుతోంది.

షావుకారు లేదనేశాడు. కాదనేశాడు. ససేమిరా ఇవ్వ నన్నాడు. తనమీద ఆశలు పెంచుకోవద్దన్నాడు.

తనంత మొత్తం ఇవ్వలేనన్నాడు. కనీసం, అప్పుగా నన్నా ఇవ్వగల పరిస్థితులలో లేనన్నాడు.

విశ్వాస ఘాతకుడు ? !

ఇన్నాళ్ళూ....ఇన్నేళ్ళూ తన రక్తంతో....తన కష్టంతో ....తన స్వేదంతో సేద్యం చేసుకున్నాడు. తన బోషాణం నింపుకున్నాడు. తమ ఆస్థులు పెంచుకున్నాడు.

ఇప్పుడు—

ఇప్పుడు—

కనీసం పిల్లపెళ్ళికి కావాల్సిన కట్నం అప్పుగా నన్నా ఇవ్వడానికి నిరాకరించాడు....రాక్షసుడు !!?!

పాతికేళ్ళ క్రితం—

తన పాతికేళ్ళ వయసులో నిరుద్యోగంతో రొప్పుతోన్న వేళ!

రాజేశ్వరీ థియేటర్‌లో కలిసాడు మా షావు కారు తండ్రి. లనని పరామర్శించి....తన మంచి చెడ్డలు విచారించి....ఆ మహానుభావుడే తనకి వాళ్ళ నూనెమిల్లులో గుమస్తా ఉద్యోగం ఇప్పించాడు.

అప్పుడు—

జీత భత్యాల్లేకుండా కేవలం తిండి....బట్టమాత్రమే పెట్టే ఒప్పందంమీద నన్ను కుదుర్చుకున్నాడు.

అప్పటికి వాళ్ళ పరిస్థితికూడా అంతంత మాత్రమే!

కాలక్రమేణా వాళ్ళ ఆయిల్ మిల్లుతో పాటు వాళ్ళ ఆస్థులూ పెరిగాయి. తనకి పెళ్ళికూడా అయింది. ఆడపిల్ల తర్వాత ఇద్దరు మగ వెధవలు! షావుకారుకూ నాఅంత వయసు పిల్లలు ముగ్గురేఉన్నారు. నేను ఉద్యోగంలో చేరేసరికి వాళ్ళు తండ్రికి చేదోడు....వాదోడుగా ముగ్గురూ వ్యాపారంలోనే ఉన్నారు.

తన పిల్లలూ పెరిగారు.

షావుకారుగారు పోయాక వాళ్ళపిల్లలు పెత్తనాల్లోకి వచ్చారు. మనిషో వ్యాపకంతో బిజీ అయ్యారు.

తను మాత్రం జీతానికి....వాళ్ళ ఆస్థుల జమా ఖర్చుల మీద అజమాయిషీ చేస్తూనే ఉన్నాడు.

తను అప్పటికీ-ఇప్పటికీ ఆ అద్దె ఇంటిలోనే మూలుగుతున్నాడు.

తనతోపాటే పెరిగినవాళ్ళు కనీసం—తన ఒక్కగానొక్క కూతురి వివాహానికి సహాయం చేయకపోగా....అప్పుగా నన్నా ఆదుకోననడం నిజంగా—తనకెంత బాధాకరం?

పెద్దాయన బ్రతికుంటే ఇలా అంటాడా?! తనని ఇలా అన్యాయం చేస్తాడా ?!

చెయ్యడు....చెయ్యడుకాక చెయ్యడు.

సినిమా హాల్లో—తిండిలేక సొమ్మసిల్లి పోయిన తనని ఆదరించి అండగా నిలిచిన ఆయన కనీసం....ఈ పెళ్ళి సమయంలో ఆర్థికంగా ఆదుకోడూ ?!

ఇల్లు వెదుక్కుంటూ వచ్చిన పెళ్ళిసంబంధం ఖాయమవడంతో ఏం చేయడానికీ తోచలేదు.

నెలసరి ఇచ్చేజీతం అయిదొందలూ ఇంటి ఖర్చులకు సరి. మరి ?! తనేం మిగల్చగలడు?! పిల్ల పెళ్ళి ఎలాచేయగలడు?! ఆ

భగవంతుడే ఉన్నాడు రెమ్మని ముహూర్తాలు కూడా తీసేయమన్నాను.

కాపీ, ఇప్పుడు....? ఆకాశానికి చేతులందక—భూదేవికి కాళ్ళందక అల్లల్లాడి పోతున్నాడు.

బేండుమేళం శబ్దంతో ఒక్కసారి ఇహానికివచ్చి తేరుకుని లేచి నిలబడ్డాను.

ఓమూల—సాయంత్రానికి కాబోయే పెళ్ళికోసం మిగతా సంబరాలు సాగిస్తున్నారు. ఇంకోమూల ఇద్దరు కొత్త దంపతులకు కాలిగోళ్ళ సంబరం చేస్తున్నారు.

ఆ కళ్యాణమంటపంలో....ఆ రాత్రికి ఎన్ని పెళ్ళిళ్ళు జరుగుతాయో !?!

అక్కడినుండి బయలుదేరి బస్సుస్టాండ్ కొచ్చాను. బస్సుస్టాండ్ నిండా జనం....జనం....!

ఎక్కడ చూసినా....ఎటు చూసినా జంటలు....జంటలు ! క్రొత్త దంపతుల జంటలు !

పసుపు బట్టలతో....పూల మాలలతో....ఆడవాళ్ళ పట్టు చీరల తోరణాలతో బస్సుస్టాండ్ అంతా కోలాహలంగా....కలివిడిగా దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

ముందు రోజు రాత్రి పెళ్ళి జరిగిన జంటలు దేవుడి దర్శనానికి కొండకి వెళ్తున్నారు.

మావూరు పుణ్యక్షేత్రం కావటం చేత— ఎక్కడెక్కడి వారో వచ్చి ఇక్కడ వివాహం చేసుకొని వెళ్ళిపోతుంటారు.

తనే—

ఇక్కడే ఉండి.... సింహాద్రిప్పన్న సన్నిధిలోనే .... ఆయన కనుసన్నలలోనే కాలం గడుపుతున్న తను....తను తన ఒక్కగానొక్క కూతురికి వివాహం చేయలేక అతలా కుతలం అవుతున్నాడు.

స్కూటర్ మీద తుర్రునవచ్చాడు షావుకారుగారి మూడో కొడుకు. వచ్చీరాగానే కబురుచెప్పి టక్కున ఉడాయించాడు.

తను ఇప్పుడు పార్వతీపురం లోడుకు వెళ్ళాలట.

పెళ్ళి ముందర పెట్టుకొని ఎవడు వెళ్తాడు.

నెమ్మదిగా ఆలోచనలతో నడుచుకుంటూ మిల్లుకువెళ్ళాను. ముగ్గురన్నదమ్ములూ త్రిమూర్తుల్లా కూర్చుని ఉన్నారు.

వాళ్ళుముగ్గురూ నావిషయమై చర్చిస్తున్నట్టున్నారు.

చర్చించినా ఏం చేస్తారు?

వెధవలు!....జలగలు! పట్టి పీడించడమే తప్పా 'తమ వద్ద పనిచేస్తున్న పనివాళ్ళ మంచి చెడ్డలు ఆలోచిద్దాం' అన్న యోచనలేని ధనాశాపరులు.

లారీ ఆయిల్ మిల్లు ముందు సిద్ధంగా ఉంది. పార్వతీపురం లోడుకు వెళ్తే రేపు సాయంత్రానికి గాని తిరిగిరావడం కుదరదు.

కానీ, తన అవస్థ....అవసరం ఏంకావాలి?!

ఈ రోజంతా ఎవరి కాళ్ళోపట్టుకొని కనీసం, కట్నం ఇవ్వాల్సిన అయిదువేల రూపాయలు ఎవరి దగ్గరన్నా అప్పుగా సంపాదించగలిగితే....పరవాలేదు. మరి? తనిలా వూళ్లేలడానికి వెళ్తే ఎలా?!

అదే ఆ ముగ్గురిముందూ పెట్టాను. నా కూతురి వివాహం కన్నా మీబోడి వెట్టిచాకిరీ బ్రతుకు నాకక్కరలేదని చెప్పాలనిపించింది.

ఇన్నాళ్ళూ నాలుగొందలరూపాయల జీతానికి నారక్తమంతా....నా కష్టమంతా హరించేసి మీరు భవంతులు నిర్మించుకున్నారు.

ఈ రోజు—

నా ఒక్కగానొక్క కూతురి పెళ్ళికి కట్నం కోసం.... అయిదువేల రూపాయలు అప్పుగా ఇచ్చి జీతం మీద వసూలు చేసుకోమని బ్రతిమలాడి అడిగినా లేదని....ఇవ్వలేమని నిరాకరించారు.

ఇదెంత న్యాయం?!

ఇన్నాళ్ళ నాశ్రమకి....సర్వీసుకి ఇదేనా మీరిచ్చినప్రశంస. ఛీ! వీళ్ళతో గొడవనాకెందుకు?! తనెక్కడికి.... ఏ షావుకారు దగ్గరకు వెళ్ళినా తనని కళ్ళకద్దుకొని ఆదరిస్తారు.

అయినా, ఈజాతంతా ఒకటే !?!

ఎవరైనా...ఏ షావుకారైనా...ఏ వ్యాపారైనా..ఇలాగే... ఈ పదంతోనే ప్రవర్తిస్తాడు.

పార్వతీపురం లోడుకు నేవెళ్ళనని తెగేసి చెప్పి మిల్లు లోపలకు వెళ్ళాను. కళాసీలు తమ పనిలో నిమగ్నమై మరమనుషుల్లా శ్రమిస్తున్నారు. యంత్రాల వేడికి....ధాటికి తట్టుకు నిలబడి వాళ్ళ చెమటని....రక్తాన్ని వేరుశనగ పలుకులతో పాటే కలిపి నూనె దిగుమతి చేస్తున్నారు.

మిల్లు డ్రైవర్ వీరాస్వామి యాంత్రికంగా తన పని తను చేసుకుపోతున్నాడు.

రాత్రీ-పగలూ విశ్రాంతి లేకుండా శ్రమించే యంత్రాల్లా వర్కర్లంతా ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు.

లారీతోపాటు షావుకారుగారి రెండో కొడుకు వెళ్ళాడు. పెద్దవాడు ఏదో పనిమీద స్కూటర్ తో వెళ్ళిపోయాడు.

ఎకౌంట్స్ బుక్ చేత్తో పట్టుకొని కళ్ళంలో కూర్చున్నాను. క్రింద వేరుశనగ పలుకులు ఆరబెట్టారు. చేత్తో గుప్పెడు పలుకులు తీసుకొని నములుతూ కూర్చున్నాను.

అన్యమనస్కంగానే అకౌంట్స్ బుక్ తెరిచి వ్రాస్తూ కూర్చున్నాను.

ఇంతలో కెవ్వున కేక....చావుకేక వినిపించేసరికి ఒక్కసారి అదిరిపడ్డాను.

నేనే కాదు. మిల్లు....మిల్లంతా అదిరిపడింది. ఎక్కడివారక్కడ పనులు వదిలేసి కేక వినిపించిన దిక్కుకేసి పరుగులెడుతున్నారు.

షావుకారుగారి మూడో అబ్బాయి గాబరాగా నా దగ్గరకు వచ్చాడు. గజగజ వణికిపోతున్నాడు. చిరుచెమటలతో తడిసి ముద్దయిపోయాడు. అతను భయం....భయంగా విషయం చెప్పేసరికి అవాక్కయిపోయాను.

నా గుండె ఓ క్షణం ఆగి తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది. అకౌంట్స్ బుక్ అలాగే క్రిందపడేసి పరుగందుకున్నాను. లోపల. ..మిల్లులో జనమంతా మూగి ఉన్నారు.

నేను వెళ్ళేసరికి అందరూ ప్రక్కకు తప్పుకున్నారు.

చేయి తెగి వీరాస్వామి క్రింద పడి ఉన్నాడు. బాధతో గిలగిలా తన్నుకుంటున్నాడు. రక్తం వరదలా కారుతోంది.

ఆ వెంటనే అతన్ని ప్రక్కనే ఉన్న గవర్నమెంటు హాస్పటల్‌కు తీసుకువెళితే వైజాగ్ పెద్ద హాస్పటల్‌కు తీసుకువెళ్ళమన్నారు.

హాస్పటల్‌లో జాయిన్‌చేసి ఆ రాత్రంతా నేను వీరాస్వామి దగ్గరే ఉన్నాను. ఆ రాత్రి షావుకారుగారి ముగ్గురు కొడుకులూ వచ్చారు.

నన్నో మూలకు తీసుకువెళ్ళి ఎలాగైనా ఈ విషయంలో పెద్ద గొడవ కాకుండా కాపాడమని నా కాళ్ళా వ్రేళ్ళా పడ్డారు.

వాళ్ళు ముగ్గురూ అలా భయంతో నన్ను బ్రతిమలాడేసరికి నా మనసు నీరుగారిపోయింది.

వీరాస్వామికి నా మాటంటే మంచి గురి. వీరాస్వామికే కాదు. వర్కర్స్ అందరికీ నేనంటే అభిమానం.

వీరాస్వామికి నష్టపరిహారంగా పాతికవేలూ ఇస్తామని వాళ్ల ముగ్గురన్నదమ్ములూ ఏకకంఠంతో చెప్పారు. గొడవ కాకుండా ఆపగలిగి....ఈ సమస్య పరిష్కరించగలిగితే నాకు అయిదు వేల రూపాయలు పారితోషికం కూడా ఇస్తామన్నారు.

వాళ్ళామాట అనేసరికి నాలో కోపం కట్టలు త్రెంచుకుంది. రాస్కెల్స్. డబ్బు ఎరవేసి ఎలాంటి వ్యక్తినన్నా తమ బానిసగా చేసుకోవాలనుకునే మూర్ఖులు వీళ్ళు.

కానీ, కోపతాపాలతో సాగే వ్యవహారాలు కావివి. తగవుల్తో వ్యవహారాలు సెటిల్ చేసుకోవాలంటే వీరాస్వామి దెబ్బతింటాడు.

నాకు ఇస్తామన్న అయిదువేలతో కలిసి ముప్పైవేలు వీరాస్వామికి అందజేస్తే గొడవ ల్లేకుండా వ్యవహారం ఓ కొలిక్కి తెస్తానని వాళ్ళకు మాట ఇచ్చాను. వాళ్ళూ అందుకు ఆనందంగా అంగీకరించారు.

వీరాస్వామికి పిల్లల్లేరు. భార్య హాస్పటల్‌కు వచ్చింది. ఆమెకి విషయమంతా వివరించాను. వీరాస్వామికింకా తెలివి రాలేదు. ఆ మర్నాడు తెలివొస్తుందని డాక్టర్లు చెప్పారు.

మిల్లు వర్కర్స్ సమ్మె చేయడానికి సిద్ధపడుతున్నారని తెలిసింది. ఆ ఉదయం మిల్లు దగ్గరకు ఆదరా బాదరా వెళ్ళాను. అప్పటికే వర్కర్స్ యూనియన్ స్ట్రయిక్ నోటీసు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

నే వెళ్ళి వాళ్ళతో చర్చించాను. విషయమంతా వివరించి చెప్పాను. గొడవలతో సాగే వ్యవహారాలు కావివని చెప్పి, మంచిగా ఒప్పించి వీరాస్వామి కుటుంబానికి ఉపకారం చేయడం మన ధ్యేయంగాని పగతో కాదని సమ్మె విరమింపజేసాను.

సమ్మె చేయడంవలన ప్రయోజనం లేదుకదా! సమ్మెవలన నష్టపోయేది బీద వర్కర్స్. సమ్మె కాలమంతా ఆకలితో కుటుంబమంతా కటకటలాడాల్సి వస్తుంది.

కేసు కోర్టుకెళితే అంత వేగంగా తేలే విషయం కాదు.

నా మాటమీద గౌరవంతో వర్కర్స్ ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. నేనూ షావుకారుగారి పెద్దకొడుకు కలిసి ఆ సాయంకాలం హాస్పటల్‌కు వెళ్ళాం. వీరాస్వామికి తెలివి వచ్చింది. నెమ్మది...నెమ్మదిగా మాట్లాడగలుగుతున్నాడు.

నేను వెళ్ళగానే కన్నీళ్ళతోనే స్వాగతం చెప్పి రెండు చేతులూ పట్టుకొని కృతజ్ఞతలు చెప్పాడు వీరాస్వామి.

వీరాస్వామికి చెప్పాల్సిందంతా చెప్పి షావుకారు కొడుకు తనతో తెచ్చిన డబ్బు వీరాస్వామికి ఇచ్చాడు. డబ్బు ముట్టినట్టు సంతకంతోపాటూ ఈ ప్రమాదం తన అజాగ్రత్తవలన జరిగిందని కాగితం వ్రాసి సంతకం తీసుకున్నాడు.

పెట్టుబడిదారీ వర్గమంటే ఇదే! వాళ్ళ జాగ్రత్త వాళ్ళది. వాళ్ళకి కావాల్సింది కార్మికుల బాగోగులు కాదు. మిల్లు లాభనష్టాలే వాళ్ళకి ముఖ్యం.

తన పని అయిపోగానే వెళ్ళిపోయాడు షావుకారుగారి పెద్దబ్బాయి.

ఆ వారం తర్వాత వీరాస్వామిని డిస్చార్జ్ చేసారు.

వీరాస్వామి బాగానే ఉన్నాడు. కానీ, చెయ్యి లేదన్న లోపం తప్పా వీరాస్వామి దృఢంగానే తిరుగాడుతున్నాడు.

ఆ రోజు—

పెళ్ళి వాళ్ళ దగ్గర్నుండి మళ్ళా ఓ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి షాకయ్యాను. ఇంకో రెండు రోజుల్లోగా కట్నం డబ్బు ఇవ్వకపోతే వేరే సంబంధం చూస్కుంటామని ఉత్తరం వ్రాసారు.

ఏం చేయను?!

ఆ రోజంతా అప్పుకోసం తిరిగి...తిరిగి ఇల్లు చేరుకున్నాను. మా ఆవిడ నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఏం చేసారంటూ ఎదురొచ్చింది? ఏం చేస్తాను? నాలాంటి టికానా లేని ఉద్యోగాన్ని నమ్మి డబ్బు ఎవరు అప్పుగా ఇస్తారు?

రాత్రి భోజనాలుచేసి ఇద్దరం అన్యమనస్కంగానే మంచాలు వాల్చుకూర్చున్నాం. పిల్లలందరూ క్రింద పడుకొని గురకలు పెడుతున్నారు.

అంతలో వీరాస్వామి వచ్చాడు.

ఎందుకొచ్చాడో మొదట అర్థంకాలేదు. కానీ, వీరాస్వామి ఎందుకొచ్చాడో తెలిసాక....అతని అభిమానానికి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

నా కూతురి పెళ్ళికి ఇంటికొచ్చి సహాయం చేస్తానంటున్న వీరాస్వామి మనిషో...మనిషి రూపంలో ఉన్న దేవుడో అర్థం కాలేదు నాకు.

అయిదువేల రూపాయలు మంచంమీద పెట్టి మీకు కలిగినప్పుడు ఇమ్మని చెప్పి నా సమాధానం కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు వీరాస్వామి.

నాకు నోట మాట రాలేదు.

మా శ్రీమతి ఆశ్చర్యంలోనుండి ఇంకా తేరుకోలేదు.

తనతో...తన బ్రతుకుతో ఇన్నాళ్ళూ ఆడుకున్న షావుకారుకి లేని దయ...జాలి వీరాస్వామికి నామీద ఎందుకు కలిగిందో నాకర్థం కాకపోలేదు.

అతనితోపాటే పాతికేళ్ళు వెట్టిచాకిరీ చేసి నిజాయితీగా... నిప్పులా బ్రతికిన తను....తనలాంటి నిర్భాగ్యుడే అన్న కనీస మానవతాదర్శంతో...దృక్పథంతో వచ్చి సహాయం చేసాడు వీరాస్వామి.

ఆ మర్నాడు వూరెళ్ళడానికి సిద్ధమవుతుండగా మా పెద్ద నాన్నగారబ్బాయి వచ్చి చావుకబురు చల్లగా చెప్పాడు.

ఆ క్షణం నేను షాకవలేదు. అవాక్కవలేదు. ప్రశాంతంగా కుర్చీలో కూర్చొని దీర్ఘంగా ఆలోచించాను.

మా తమ్ముడు చెప్పిన విషయం నిజంగా తనకి చావు కబురే?

ఏ తండ్రీ.. ఎలాంటి తండ్రైనా తన కూతురికి తెలిసి... తెలిసి తనలాంటి ఆర్థిక ఇబ్బందులు...అస్తవ్యస్థ పరిస్థితులు ఎదురవకూడదని ఆలోచిస్తాడు.

ఏరి కోరి తనలాంటి నిర్భాగ్యుడికి ఇచ్చి పెళ్ళి చేయలేడు. తనకి కాబోయే అల్లుడు కూడా తనలాగే ఏదో మిల్లులో...ఎవరో షావుకారు దగ్గర వెట్టిచాకిరీ చేస్తున్నాడని తమ్ముడు చెప్పిన విషయం విన్నాక....తనలాంటి ఉద్యోగమే....తనలాంటి బానిస బ్రతుకు బ్రతికే మనిషి....తనకి అల్లుడు కావడానికి వీల్లేదని నిర్ణయించుకున్నాను.

పెళ్ళివాళ్ళకి ఉత్తరం వ్రాసి పడేసాను. మీ సంబంధం మాకిష్టం లేదని జవాబు వ్రాసి పడేసాను. ఉత్తరం పోస్టుడబ్బాలో పడేసి వీరాస్వామి ఇంటికేసి బయల్దేరాను.

డబ్బు జేబులో భద్రంగా ఉందో...లేదో తడిమిచూసుకొని అడుగులేస్తున్నాను.

* * *